నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 31 డిసెంబర్ 2023 | BHADRADRI KOTHAGUDEM

బీటీపీఎస్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బీటీపీఎస్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘనస్వాగతం పలుకుతున్న అధికారులు

మణుగూరుటౌన్, డిసెంబర్ 30: భద్రాద్రి జిల్లా మణుగూరు పట్టణ శివారులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)ను శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సందర్శించారు. తొలుత హెలికాప్టర్ ద్వారా మణుగూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద ఆయనకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ సీఎం రోడ్డు మార్గం ద్వారా బీటీపీఎస్‌కు చేరుకున్నారు. ఆయనకు బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, జెన్కో అధికారులు స్వాగతం పలికారు. సీఈ బిచ్చన్న డిప్యూటీ సీఎంకు ప్లాంట్ పరిధిలో విద్యుత్ ఉత్పత్తి, రవాణా గురించి వివరించారు.

పెన్షనర్లకు అండగా ఉంటాం..

రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం నగరంలో నిర్వహించిన పెన్షనర్ల దినోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, డిసెంబర్ 30: పెన్షనర్లకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పెన్షనర్ల సంఘం నిర్వహించిన వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పింఛనుదారుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 40 ఏళ్ల రాజకీయ అను భవంలో తాను ఏనాడూ ఉద్యోగులను ఇబ్బంది పెట్టలేదన్నారు. అనంతరం పెన్షనర్స్ సంఘానికి సంబంధించిన డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎర్నేని రామారావు, అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుబ్బయ్య, కల్యాణం కృష్ణయ్య, రిటైర్డ్ తహసీల్దార్ పూస సాంబశివరావు పాల్గొన్నారు.

పథకాలకు దరఖాస్తు చేసుకోండి

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, డిసెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీల పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం కొత్తదంతెనం పంచాయతీలోని సీతారాంపురంలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తెల్లం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తోందని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనవరి 6వ తేదీ వరకు ప్రభుత్వ పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పారదర్శకంగా పరిశీలించి అర్హులైన దరఖాస్తుదారులకు పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం అదే పంచాయతీలోని ఏకలవ్య పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. పిల్లలతో కొద్దిసేపు మాట్లాడి మధ్యాహ్న భోజనానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామసభలో జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, దామెర్ల శ్రీనివాసరావు, మోతుకూరి శ్రీకాంత్, కొత్తా మల్లేశ్, పాడియం సుబ్బారావు, ఎస్‌కె.బాషా, బొల్లోజు రవి, పవన్, అజీమ్, ముత్యాలరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికులు

ప్రయాణికులకు విజ్ఞప్తి..

సరిపడా బస్సుల్లేవ్!

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే హడావిడిగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఆదిలోనే అభాసుపాలవుతున్నది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించడం మంచిదే.. కానీ రద్దీకి తగ్గట్లు బస్సులు లేకపోవడంతో ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. సరిపడా బస్సుల్లేక ప్రయాణికులు ఈసడించుకుంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధి ఖమ్మం రీజియన్‌లో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 550 బస్సులు మాత్రమే ఉన్నాయి. గతంలో 67 శాతం ఉన్న ఆక్యుపెన్సీ ప్రస్తుతం 85 శాతానికి పెరిగింది. అప్పుడు రోజుకు లక్ష నుంచి లక్షా ఐదు వేల మంది ప్రయాణం చేయగా.. ఇప్పుడు లక్షా నలభై వేల మంది వరకు ప్రయాణిస్తున్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

మహాలక్ష్మి పథకంతో కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు

ఖమ్మం రీజియన్‌లో భారీగా పెరిగిన ఆదాయం

సరిపడా బస్సుల్లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఉమ్మడి ఖమ్మంలో కేవలం 550 బస్సులే..

పండుగలకు స్పెషల్ బస్సులు లేనట్లే..

కొత్త బస్సుల కోసం ఎదురుచూపులు



ఖమ్మం, డిసెంబర్ 30 : ఎన్నికల హామీని అమలు చేసే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలవుతున్నది. సరైన ప్రణాళిక, ముందుచూపు లేనికారణంగా పేదలు, ముఖ్యంగా మహిళలు బాగా ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండ్రోజుల్లోనే అత్యంత ఆర్భాటంగా ప్రారంభించిన 'మహాలక్ష్మి' పథకం అమలులో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతిరోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 6 డిపోలు పరిధిలో అనేక రూట్లలో ప్రయాణికుల మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నవి. వాటిని సరిచేయలేక కండక్టర్లు, డ్రైవర్లకు తలనొప్పిగా మారాయి. సరిపడా బస్సులు లేకపోవడం, పథకం అమలుపై ముందస్తు చర్యలు తీసుకోకపోవడం, బస్సుల సంఖ్యను పెంచకపోవడం, అద్దె బస్సు యజమానుల సమస్యలను పరిష్కరించకపోవడం, పండుగలు, పెళ్లిళ్ల సీజన్ తదితర ప్రత్యేక అవసరాల్లో నడిపే బస్సులపై సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల మహాలక్ష్మి పథకం ఆదిలోనే అభాసుపాలవుతున్నది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధి ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోలు ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 550 బస్సులు ఉన్నాయి. వీటిలో 8 శాతం బస్సులు అంటే.. 44 బస్సులను స్పేర్‌లో ఉంచి 506 బస్సులను మాత్రమే నడుపుతారు. ఖమ్మం రీజియన్ పరిధిలో పల్లె వెలుగు 200, ఎక్స్‌ప్రెస్ 173, ఏసీ 32, సూపర్ లగ్జరీ 80, డీలక్స్ 7 ఉన్నవి. వీటిలో ప్రభుత్వం పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లకు మాత్రమే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది.

పెరిగిన డిమాండ్

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సులకు డిమాండ్ పెరిగింది. రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరిగింది. కానీ వారికి తగ్గట్లు బస్సులు అందుబాటులో లేవు. రోజుకు దాదాపు 40వేల మంది ప్రయాణికులు పెరిగారు.. కానీ బస్సులు మాత్రం గతంలో ఉన్నవి మాత్రమే ఉన్నవి. ఉన్న రూట్లలో ఎక్కువ బస్సులు నడపాలని, ఇంతవరకు బస్సులు లేని గ్రామాలకు కొత్తగా బస్సులు నడపాలనే డిమాండ్ రోజురోజుకు పెరుగుతున్నది.

కొత్తవాటిపై ఆశలు

ఆర్టీసీ సంస్థలో 2,050 బస్సులు కొత్తవి రానున్నాయని ఆ సంస్థ ఎండీ ఇటీవల ప్రకటించారు. వాటిలో 1,000 ఎలక్ట్రిక్ బస్సులు, 1,050 డీజిల్ బస్సులు రానున్నాయి. ఇవే వస్తే కనుక ఖమ్మం రీజియన్‌కు సుమారు 100 బస్సులు అదనంగా వచ్చే అవకాశం ఉంది. అప్పుడు ప్రయాణికుల బాధలు తప్పే అవకాశం ఉంది.

భారీగా పెరిగిన ఆదాయం

ఖమ్మం రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో మహాలక్ష్మి పథకం అమలుకు ముందు రోజుకు కోటి రూపాయల ఆదాయం వస్తే, ప్రస్తుతం రూ.కోటీ నలభై లక్షల ఆదాయం వస్తున్నది.. అంటే దాదాపు రోజుకు రూ.40 లక్షల ఆదాయం పెరిగింది.

పండుగలకు ప్రత్యేక బస్సులు లేనట్లే..

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఈ పథకం ప్రారంభానికి ముందు ఖాళీ సీట్లతో తిరిగిన బస్సులు ఎక్కడ చూసినా కళకళలాడుతున్నాయి. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఆదాయం పరుగులు తీస్తున్నది. మహిళలకు టికెట్ ఉచితంగా ఇస్తున్నప్పటికీ ఆ డబ్బును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనున్నది. దీంతో ఆర్టీసీ సంస్థకు ఆదాయం బాగా పెరిగినట్లయ్యింది. గతంలో 50 శాతం కూడా నిండని బస్సుల్లో 75 నుంచి 80 శాతం వరకు ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) పెరుగుతూ వస్తున్నది. గతంలో ఖమ్మం రీజియన్‌లో 67 శాతం ఆక్యుపెన్సీ ఉండగా.. ప్రస్తుతం 85 శాతానికి పెరిగింది. మహాలక్ష్మికి ముందు గతంలో ఖమ్మం రీజియన్ పరిధిలో రోజుకు ఒక లక్ష నుంచి ఒక లక్షా ఐదు వేల మంది ప్రయాణికులు ప్రయాణం సాగించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య రోజుకు ఒక లక్షా ముప్పైఐదు వేల నుంచి ఒక లక్షా నలభై వేల వరకు పెరిగారు. ఏ బస్సు చూసినా కిక్కిరిసిన రద్దీతో ఉంటోంది. మామూలు రోజుల్లో ఐతే గతంలో పండుగకో, శుభకార్యాలు ఉన్నప్పుడో బస్సుల్లో సీట్లు నిండేవి. ఆ సందర్భాల్లో ఇతర మార్గాల్లో ఖాళీగా నడిచే బస్సులను రద్దీ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా నడుపుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేవారు. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం ద్వారా ఉన్న ఆర్టీసీ బస్సులు రద్దీగా మారడంతో పండుగ సీజన్‌లో ప్రత్యేక బస్సులు ఎలా అనే ప్రశ్న తలెత్తుతున్నది. నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండుగలకు హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, మణుగూరు తదితర ప్రాంతాలకు రాకపోకలు పెరగనున్నాయి. ఉద్యోగాలరీత్యా వెళ్లిన వారు, చదువుల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు సంక్రాంతి పండుగకు వస్తుంటారు. అయితే ఈ ఏడాది స్పెషల్ బస్సులు లేనట్లేనని ప్రజలు నిరాశ చెందుతున్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి

ఉచిత ప్రయాణం చేసే అవకాశం ప్రభుత్వం కల్పించింది.. మంచిదే కానీ బస్సులను కూడా పెంచాలి. బస్సు ఎక్కితే కాలుపెట్టే అవకాశం లేదు. కండక్టర్ వచ్చి టికెట్ కూడా ఇవ్వలేక పోతున్నారు. బస్సులు ఎక్కువ ఉంటే ఈ ఇబ్బందులు ఉండవు కదా. సీఎం సార్ ఈ విషయంపై దృష్టి సారించాలి.

– ఎన్.విజయలక్ష్మి, విభలాపురం, మోతె మండలం, సూర్యాపేట జిల్లా

ముందుగా ప్లాన్ చేస్తే బాగుండు

పథకం పెట్టే ముందే బస్సులను పెంచితే ఇబ్బంది ఉండేది కాదు. ఉచిత ప్రయాణం చాలా మంచిదే. కానీ ముందస్తు ప్లాన్ చేసి అన్ని గ్రామాలు, పట్టణాలకు బస్సులను పెంచితే ప్రజలకు ఇబ్బందులు ఉండేవి కావు. ఇప్పటికైనా బస్సుల సంఖ్యను పెంచి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

–కాశిమల్ల భవాని, ప్రయాణికురాలు, ఖమ్మం

కొద్దిరోజుల్లోనే కొత్త బస్సులు

ఆర్టీసీ ప్రయాణికులు కండక్టర్, డ్రైవర్‌కు సహకరించాలి. దురుసుగా ప్రవర్తించి వారి విధులకు భంగం కలిగించవద్దు. ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒరిజినల్ ధ్రువపత్రాన్ని కండక్టర్‌కు చూపించాలి. నిలబడి ప్రయాణం చేయవద్దు. ఆధార్ ఫోన్‌లో ఉందని, జిరాక్స్ ఉందని అనవద్దు. తక్కువ దూరం ప్రయాణం చేసేవారు పల్లె వెలుగులో చేయాలి. రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికుల వల్ల బస్సులు సరిపోవడం లేదు. కొద్దిరోజుల్లో కొత్త బస్సులు వస్తాయి. ఆ తరువాత ఎలాంటి ఇబ్బందులుండవు.

– సీహెచ్ వెంకన్న, ఖమ్మం రీజియన్ మేనేజర్

కొనసాగిన అర్జీల స్వీకరణ

- ప్రారంభంకాని దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు
- గ్రామసభలను సందర్శించిన కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక ఆల
- నేడు, రేపు ప్రజా పాలన గ్రామసభలకు సెలవు

ఖమ్మం నగరం ధంసలాపురం కొత్తకాలనీలో జరిగిన సభలో దరఖాస్తు అందజేస్తున్న దివ్యాంగుడు

ఖమ్మం, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన గ్రామ సభలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండలాల స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించి ప్రజల నుంచి సిబ్బంది దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆదివారం మూడో రోజు సైతం గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. ఉదయం, మధ్యాహ్నం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు ఏర్పాటు చేసి తహసీల్దార్, ఎంపీడీవోల ఆధ్వర్యంలో రెండు బృందాల ద్వారా సభలు నిర్వహించి అర్జీలు స్వీకరించారు. మధిరలో ఏర్పాటు చేసిన గ్రామ సభను కలెక్టర్ వీపీ గౌతమ్ పరిశీలించారు. స్వయంగా కౌంటర్ల వద్దకు వెళ్లి సిబ్బంది స్వీకరించిన దరఖాస్తులను నిశితంగా పరిశీలించారు. ఖమ్మం నగరం 14వ డివిజన్ మధురానగర్‌లో ఏర్పాటు చేసిన సభను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఖమ్మం రూరల్ మండలంలో గ్రామ సభల ఏర్పాట్లు, ప్రజలకు కల్పించిన సౌకర్యాలపై స్పెషల్ ఆఫీసర్ జ్యోతి స్థానిక అధికారులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రాంపురం పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. టేకులపల్లి మండలం ప్రేగళ్ళపాడు పంచాయతీలో జరిగిన గ్రామ సభలో కలెక్టర్ ప్రియాంక ఆల పాల్గొన్నారు. మణుగూరు మండలం రాజుపేటలో జరిగిన గ్రామ సభకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు. అయితే ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన అధికారులు ఇప్పటివరకు వాటిని ఆన్‌లైన్ చేయడం లేదని తెలుస్తోంది. ప్రతి రోజు స్వీకరించిన దరఖాస్తులను ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత సదరు దరఖాస్తులను నిర్దేశించిన వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. దరఖాస్తులు నింపే సమయంలో ప్రజలకు వచ్చిన సందేహాలను అధికారులు నివృత్తి చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కొత్త రేషన్ కార్డులు, ఇంట్లో ఒక్కరికంటే ఎక్కువగా ఉంటే మహాలక్ష్మి పింఛన్ కోసం ఎలా దరఖాస్తు చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అయితే పింఛన్ పొందుతున్న వృద్ధులు, రైతుబంధు తీసుకుంటున్న రైతులు మరోసారి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని చెప్పినప్పటికీ ప్రజలు మాత్రం ప్రతి పథకానికి టిక్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. కాగా.. ఆది, సోమవారం ప్రజా పాలన గ్రామ సభలకు సెలవు కాగా.. తిరిగి జనవరి 2 నుంచి 6వ తేదీ వరకు సభలు కొనసాగే అవకాశం ఉంది.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ జతచేయాలి

కలెక్టర్ వీపీ గౌతమ్

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం, డిసెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభల్లో ఆరు గ్యారెంటీల పథకాల కోసం అర్హులందరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శనివారం ఖమ్మం నగరం 14వ డివిజన్ పరిధిలోని గొల్లగూడెం, మధురానగర్ పాఠశాలలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలనను తేవాలని ఉద్దేశంతో ప్రభుత్వం 'ప్రజాపాలన' చేపట్టిందన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 217 గ్రామ పంచాయతీలు, వార్డుల్లో ప్రజాపాలన సభలు నిర్వహించి, 60వేలకు పైగా దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. లబ్ధిదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ దరఖాస్తును నింపి కౌంటర్లలో అందించాలన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే జనవరి 6వ తేదీ వరకు సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుఫారంతోపాటు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ ప్రతులను జతపరచాలని, తప్పనిసరిగా రశీదు తీసుకొని భద్రపరచాలని సూచించారు. ఇప్పటికే లబ్ధి పొందుతున్న వారు మళ్లీ దరఖాస్తులో నింపనవసరం లేదన్నారు. ప్రజాపాలన సభల వద్ద ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌లో సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్ కూరాకుల వలరాజు పాల్గొన్నారు.

ఉచిత దరఖాస్తులనే స్వీకరించాలి

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

టేకులపల్లి, డిసెంబర్ 30 : ప్రజా పాలన గ్రామసభల్లో ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన దరఖాస్తులను మాత్రమే పూర్తి చేసిన తర్వాత స్వీకరించాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులకు సూచించారు. శనివారం ప్రేగళ్ళపాడు గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజా పాలన గ్రామ సభను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి కౌంటర్ వద్దకు వెళ్లి దరఖాస్తుదారులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. అధికారులు ఇంటికి వచ్చి ఖాళీ దరఖాస్తులు ఇచ్చారా.. అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి ప్రజా పాలన దరఖాస్తులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. జిరాక్స్ సెంటర్లలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా జిరాక్స్‌లు తీస్తే ఆయా సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్సై, తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే ప్రతి దరఖాస్తును సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించాలని, తప్పులు లేకుండా నింపే విధంగా చూడాలని సూచించారు.

మండలంలోని ఆరు ప్రాంతాల్లో చేపట్టిన గ్రామ సభలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నమోదు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, జడ్పీ సీఈవో విద్యాలత, డీపీవో రమాకాంత్, ఆర్డీవో శిరీష, నియోజకవర్గ ప్రత్యేకాధికారి కాశయ్య, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో కె.వీరబాబు, ఏపీవో రవికుమార్, సర్పంచ్ కణితి రమాదేవి, ఎంపీటీసీ బానోత్ సరోజిని, ఉప సర్పంచ్ పసుపులేటి మాధవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రీడలు

కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారిణులు

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 30 : మండలంలోని సుభాష్‌నగర్ గిరిజన గురుకుల పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రీడలు శనివారం మూడో రోజుకు చేరాయి. ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, కరీంనగర్ జోన్ల నుంచి 1,200 మంది క్రీడాకారిణులు వివిధ క్రీడాంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. శనివారం జరిగిన క్రీడాంశాల వివరాలను ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ టి.వెంకటేశ్వరరాజు, ప్రిన్సిపాల్ అరుణకుమారి, క్రీడా కో ఆర్డినేటర్ జి.మాధవి వెల్లడించారు. అండర్-19 హ్యాండ్‌బాల్ విభాగంలో జోన్-4 ప్రథమ, సెలక్షన్ టీం జోన్-4 ద్వితీయ బహుమతి గెలుచుకుంది. అండర్-17 ఖోఖో విభాగంలో జోన్-3 ప్రథమ, జోన్-4 ద్వితీయ బహుమతి సాధించింది. అండర్-14 వాలీబాల్ విభాగంలో జోన్-1, 3 తలపడగా.. జోన్-3 విజయం సాధించింది. జోన్-2, 1 తలపడగా.. జోన్-1 విజయం సాధించింది. అథ్లెటిక్స్ అండర్-19 విభాగంలో జోన్-3కు చెందిన టి.శ్రీతేజ 200 మీటర్ల హైజంప్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించింది. అండర్-17 విభాగంలో జోన్-1కు చెందిన జే.స్వాతిక 200 మీటర్ల పరుగుపందెంలో మొదటి బహుమతి గెలుచుకుంది.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

–జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్

కేసులను పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి, న్యాయమూర్తులు

ఖమ్మం లీగల్, డిసెంబర్ 30 : లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకొని లాభం పొందాలని జిల్లా జడ్జి బీ.ఎస్. జగ్జీవన్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మంలో జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఇరు పక్షాల వారిని గెలిపించే వేదిక లోక్ అదాలత్ అని, ప్రతిఒక్కరూ సమయం విలువను గుర్తించి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖమ్మంలోని ప్రముఖ వైద్యుడు, యూనియన్ బ్యాంకుపై దాఖలు చేసిన రెండు సివిల్ కేసుల్లో రాజీ చేసిన న్యాయమూర్తులు లోక్ అదాలత్ అవార్డు జారీ చేశారు. కార్యక్రమంలో న్యాయసేవా సంస్థ న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావేద్‌పాషా, న్యాయమూర్తి కె.ఆశారాణి, బ్యాంకు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు. లోక్ అదాలత్ సభ్యుడిగా న్యాయవాది ఎ.విజయ్‌రాఘవ వ్యవహరించారు.

కేసుల పరిష్కారం

జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు, ముందస్తు (ప్రి లిటిగేషన్ కేసులు) ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్.జగ్జీవన్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాసంస్థ కార్యదర్శి అబ్దుల్ జావేద్‌పాషా కేసుల పరిష్కారం కోసం బెంచ్‌లను ఏర్పాటు చేశారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి.. మోటరు వాహన ప్రమాద కేసులను విచారించి.. 91 కేసులను పరిష్కరించారు. బాధితులకు రూ.1.77 కోట్ల పరిహారం ఇప్పించారు. అలాగే విద్యుత్ చౌర్యం కేసులను కూడా పరిష్కరించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.ఆశారాణి సివిల్ కేసుల లోక్ అదాలత్ బెంచ్‌కి అధ్యక్షత వహించి.. బ్యాంకు, ఇతర సివిల్ తగాదాలను పరిష్కరించారు. క్రిమినల్, చెక్కులు, డ్రంకెన్ డ్రైవ్ కేసులను మెజిస్ట్రేట్‌లు పి.గోపిక, నాగశ్రావ్య, కె.దీప, వి.మాధవి, ఆర్.శాంతిలత పరిష్కరించారు. పెట్టీ కేసులను రెండవ శ్రేణి మెజిస్ట్రేట్ సలీంపాషా పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రాల తనిఖీ

పరీక్షలను పర్యవేక్షిస్తున్న అడిషనల్ కంట్రోలర్

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 30 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఖమ్మం నగరంలో జరుగుతున్న డిగ్రీ ద్వితీయ సంవత్సరం పరీక్ష కేంద్రాలను కేయూ అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ నరేందర్ శనివారం తనిఖీ చేశారు. నగరంలోని కవిత మెమో